తేది. 07-04-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# వాసుదేవ మిదం సర్వం

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతా లవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్

**ప్రేమాస్వరూపులారా!**

సృష్టి చిత్రంబులు ఎంత విచిత్రమయ్యా. దుర్లభోమానుషోదేహః. శరీర నిర్మాణమునందే కాక, మేధాశక్తి యందు జగత్తునందుగల సర్వ జంతువులకంటె ఉత్కృష్టమైన జన్మము మానవ జన్మము. సర్వ జంతు సామాన్యము నుండి వేరుచేయబడిన పవిత్ర స్వరూపుడు మానవుడు. అట్టి ఉత్తమమైన, ఉత్కృష్టమైన మానవజన్మ ఎత్తి కూడా ఈ మానవత్వమును గుర్తించుకోలేకపోవటమే దురదృష్టము. ప్రతిక్షణము ప్రతి మానవుడు అనుభవించే, ఆచరించే, ఆనందించే విషయాన్ని తాను గుర్తించుకో లేకపోతున్నాడు.

భారతీయుల పవిత్రమైన పర్వదినములు ఒక ఉత్కృష్టమైన, విశిష్టమైన అంతరార్థముతో కూడియున్నవి. ఈనాడు ఉగాది. ఉగాది అనగా సంవత్సరముతో ప్రారంభమగునది అని అందరూ తలుస్తారు. ఇది యుగమునకే ఆది. యుగమునకు ఆది యుగమునకు అంత్యము భగవంతుడే. కనుక భగవంతుని యుగాది కృత్ అని పేరు. కేవలము యుగమును సృష్టించటమే కాకుండా యుగమును నడిపేవాడు కూడా భగవంతుడే. కనుక భగవంతునకు యుగవర్తనుడు అని పేరు. ఈ యుగమును త్రిప్పుటలో మహాశక్తివంతుడు భగవంతుడు. మహా మేధావంతుడు భగవంతుడు. కనుకనే భగవంతునకు యుగాధరుడు అనిపేరు. ఇతనికే యుగంధరుడని మరొకపేరు. యుగమును సృష్టించటము యుగమును అంత్యము గావించటము భగవత్ తత్త్వము. ఈ ఉగాదినే సంవత్సరాది పండుగ అని మరొక విధముగా భావిస్తారు.

**కాలము భగవత్ స్వరూపము**

sri sathyasai vachanamrutam

సంవత్సరమనగా ఏమి? భగవంతుని పేరే సంవత్సరము. సర్వమునందు కూడా వసించేవాడు కాబట్టి సంవత్సరమని పేరు. ఇంతేకాక ఈ సంవత్సరమునకు ఆత్మస్వరూపుడు భగవంతుడే. ఈ సంవత్సరమునకు కాలము అని మరొకపేరు. కాలమునకు ఆత్మస్వరూపుడు భగవంతుడు. కనుక భగవంతునకు కాలాత్మకుడని మరొకపేరు. కాలాత్మకుడనగా భగవంతుడే. కనుక ఉగాది అనగా భగవంతుని ఆకారమే. విశ్వం విష్ణు స్వరూపం. సర్వం ఖల్విదం బ్రహ్మ. కనుక కృత, త్రేతా, ద్వాపర, కలియుగముల స్వభావము నాల్గింటిలో కూడినది. అందువలన భగవంతునకు చతురాత్మకుడని పేరు. నాలుగు విధములైన విభూతులతో కూడి ఉండిన ఆత్మయే చతురాత్మకము. ఒకటి వాసుదేవుడు. రెండవది సంరక్షణ. మూడవది అనిరుద్ధుడు. నాల్గవది ప్రద్యుమ్నుడు. ఈ నాల్గింటి యొక్క ఏకస్వరూపమే అవతారము. ఈ నాలుగు విభూతుల శక్తి కూడా ఒక్కటేగాని రెండుకాదు. కనుక భగవంతుడనగా ప్రత్యేకించిన స్వరూపమనిగాని, శక్తి అనిగాని భావించరాదు. కాలమే భగవంతుని స్వరూపము. కనుకనే కాలాయనమః, కాల కాలాయనమః, కాలాతీతాయనమః, కాలస్వరూపాయనమః. అంతా కాలముతో కూడినవాడు భగవంతుడు. భగవంతునకు వత్సరమని కూడా పేరు. సర్వజీవులందు నివసించే శక్తికే వత్సరమని పేరు. గోవత్సములతో ఆడుకొనే వాడు కనుక భగవంతునకు గోవత్సలుడని మరొకపేరు.

చతురాత్మకుడైన భగవంతునకు మొదటి స్వరూపము వాసుదేవ. అన్నింటి యందు వాసము చేసేవాడు. అన్ని తనయందే వాసముచేసి సర్వమునందు వ్యాప్తమైన దివ్యత్వమునకు వాసుదేవమని పేరు. ఇతను మహత్తరమైన శక్తిమంతుడు. తేజోమయుడు. అన్ని రంగములందు, అన్నిస్థానములందు, అన్ని విషయములందు, అన్ని కాలములందు చలించని, భ్రమించని, స్థిరమైన, నిత్యమైన, సత్యమైన తలంపుతో కూడినటువంటివాడు వాసుదేవుడు. ఇతనికే అంగీరసుడని మరొకపేరు. సర్వ అంగములందు కూడ రక్త స్వరూపముతో, ప్రాణ స్వరూపముతో ప్రసరించి ఆశక్తిని అందించేవాడు కనుక అతనికి అంగీరసుడని అన్నారు. భగవంతుని రసో వైసః అన్నారు. సమస్తము భగవంతుని స్వరూపమేగాని అతనిని మించిన స్వరూపము మరొకటి లేదు.

sri sathyasai vachanamrutam

చతురాత్మక స్వరూపుడైన భగవంతునకు సంకర్షణుడని మరొకపేరు. ఈ సంకర్షణుడు ఎవరు? ప్రళయకాలమందు సమస్త జగత్తును తనలో ఆవిర్భవింప చేసుకొనేవాడు సంకర్షణుడు. దుఃఖ నివృత్తి, ఆనంద ప్రాప్తియే సంకర్షణుని తత్త్వము. సంకర్షణమనగా దుఃఖమును నివృత్తి గావించటము, ఆనందమును అభివృద్ధి గావించటము. మన అశాంతిని నివృత్తిని గావించటము ప్రశాంతిని అభివృద్ధి గావించటము. దుఃఖమును దూరము చేయటము ఆనందాన్ని అందించటము. బలహీనత్వాన్ని దూరం చేయటం బలత్వాన్ని అనుగ్రహించటం. ఒకదానిని తీసి మరొక దానిని నింపటమే సంకర్షణుని తత్త్వము. ఇది చిన్న విషయముగా మనము భావిస్తాము. కాదు. కాదు. ఇది మానవత్వమునకు అత్యవసరమైనది. భగవంతుడు సంకర్షణ రూపములో ప్రతి మానవునియందు ఉంటున్నాడు. అనిరుద్ధుడని మరొక నామము. అనిరుద్ధుడనగా విశిష్టమైన సంపదలు కలిగినవాడు. ఈ సంపదను ప్రార్థించే వారికి అనుగ్రహించేవాడు. ఆధ్యాత్మికముగా శక్తులను అందించి ఆనందమును అందించేవాడు భగవంతుడు. తనకు తానే ప్రకాశింప చేసుకునేవాడు అనిరుద్ధుడు. ఈ ప్రకాశమునకు మరొక కారణము ఉండనవసరము లేదు. ఏకోహంబహుస్యాం తనకు తానే సంకల్పించుకొని సర్వమును సృష్టింప చేసేది ఇది. ఈ అనిరుద్ధత్వమనేది మానవునకు చాలా అత్యవసరము.

నాల్గవది ప్రద్యుమ్నుడు. ప్రద్యుమ్నుడు అనగా ఇతనిని సాధించేవారుగాని ఇతనిని జయించేవారుగాని జగత్తులో ఎవ్వరూ లేరు. జగత్తులో ఇతనికి ఇతనేసాటి. తనకు తానే మేటి. తనకంటె తక్కువ వారుగాని ఎక్కువ వారుగాని ఎవరూ లేరు. కారణమేమనగా తాను తక్కువ వారియందు కూడా ఉన్నాడు. ఈ ప్రద్యుమ్నత్వము సర్వము సమత్వముగా వ్యాపించినటు వంటిది. ఈ నాలిగింటి యొక్క ఏకత్వము మానవత్వము. భగవంతుడు మానవునికంటె ప్రత్యేకముగా లేదు. వాసుదేవుడు -పరమాత్మ. సంరక్షణుడు-జీవాత్మ. ప్రద్యుమ్నుడు-మనస్సు. అనిరుద్ధుడు-అహం. ఈ నాలిగింటి యొక్క ఏకత్వమే మానవత్వము. ఈ నాల్గింటిలో ఏ ఒక్కటి లేకపోయినను ఈ జగత్తులో జీవించటానికి వీలుకాదు. అయితే అహంకారము కూడా ఉండాలా అనవచ్చును. అహం వుండాలి. కాని అహంకారము ఉండకూడదు. అహమనగా నేను. ఆకారమే నేనని భావించరాదు. అహం బ్రహ్మాస్మి నేను దేహము కాదు. నేను జీవాస్మి కాదు. అహం. అహం.

సంస్కృతము లోపల అకారమనే అక్షరముతో ప్రారంభమవుతుంది. అంత్యములో హ కారము వస్తుంది. ప్రారంభములో అకారము, అంత్యములో హకారము వస్తుంది. ప్రారంభములో అకారము, అంత్యములో హ కారము రెండూ చేరినప్పుడు అహం అవుతుంది. ఈ రెండింటి యందే మిగిలిన శబ్దములన్నీ లీనమై వుంటున్నాయి. అహం అనగా అణువు నుండి బ్రహ్మము వరకు వ్యాపించిన తత్త్వము. కనుకనే మహావాక్యము నందు అహం బ్రహ్మాస్మి అన్నారు. ప్రజ్ఞానం బ్రహ్మ. ఆ ప్రజ్ఞానమే నేను. తత్వమసి అదే నేను. ఇటువంటి మహా వాక్యముల అర్థాన్ని గుర్తించుకొనలేక కేవలము అనిత్యము అశాశ్వతమైన దేహమునే నిత్యముగా భావించి దుఃఖమునకు గురౌతున్నారు. ఈ నాలుగు మహా వాక్యముల ఏక స్వరూపమే భగవంతుడు.

## ప్రకృతి – పరమాత్ముడు

ఈ భగవంతుని పదములోనున్న అర్థమును ఎవ్వరు గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. భగ అనగా సంభర్త అని అర్థము. రెండవది భర్త అని అర్థము. ఈ జగత్తును ఆధారముగా చేసుకొని సృష్టించటమే సంభర్త. ప్రకృతిని ఆధారముగా చేసుకొని భగవంతుడు సృష్టి గావిస్తున్నాడు. మట్టిని, నీటిని కలిపి కుమ్మరివాడు కుండలు నిర్మిస్తున్నాడు. నీరు లేకపోయినా లేక మట్టి లేకపోయినా కుండలు సృష్టించ లేడు. కుండకు నీరు మట్టి ఆధారము. ఈ పంచ భూతములలో రెండు భూతములు కలిసినప్పుడే సృష్టి జరుగుతుంది. అయితే ఆ రెండు పదార్థములు కూడా అతని స్వరూపాలే. ఎంత విచిత్రమయ్యా! గాలికి దీపము నార్పే శక్తి ఇచ్చాడు. దీపమునకు చీకటి దూరము చేసే శక్తి ఇచ్చాడు. అదే గాలి ఇదే దీపముపైన వీచిందంటే దీపము ఉండటానికి వీలు లేదు. ఒకే భగవంతుని శక్తులు. ఒకటి ఇంకొక దానిని ఆర్పుతుంది. రెండూ ఒకటే కదా! దానికి ఆర్పే శక్తి ఎందుకిచ్చాడు అంటే ఆర్పే శక్తి దానిది. ఆర్పబడే శక్తి దీనిది.

దైవసృష్టి అర్థము చేసుకోలేని అంతరార్థముతో కూడి ఉంటున్నది. ప్రకృతి నాధారము చేసుకొని భగవంతుడు సృష్టి గావిస్తున్నాడు. అందుకే అతనికి సంభర్త అన్నారు. సృష్టించిన దానిని కాపాడేవాడు భర్త. భ అనగా తేజస్సు. గ అనగా వ్యాప్తి గావించటం. వంతుడనగా

sri sathyasaivachanamrutam

సమర్థుడు, శక్తివంతుడని అర్థము. కాంతిని వ్యాప్తి గావించే సమర్థుడే భగవంతుడని అర్థము. భగవంతుడు సర్వత్రా తేజోవంతమైన జ్ఞానమును ప్రకాశింప జేస్తున్నాడు. సర్వత్రా భగవంతుని ప్రకాశమే లేకపోతే మనము క్షణమైనా జీవించలేము. పంచభూతాత్మకమైన ఈ శరీరము సుక్షేమముగా జీవించటానికి భగవత్ తత్త్వమైన శక్తి సర్వక్షేమాన్ని అందిస్తుంది. కనుక ఉగాది అనగా మనము ఒక పర్వదినముగా భావించరాదు. అది దైవ దినముగా మనము విశ్వసించాలి. అది పరార్థమైన దినముగా మనము విశ్వసించాలి.

భారతీయుల పర్వదినములన్ని ఒక విశిష్టమైన అంతరార్థముతో కూడి ఉన్నాయి. మనము బాహ్య విషయములనే ప్రధానముగా పెట్టుకొని, పాయసం చేసుకొని ఆనందిస్తున్నాము. ఇదే పర్వదినముగా మనము భావిస్తున్నాము. భగవంతుని స్మరింపజేసి కొన్ని విధములైన ఆనందములను అనుభవింపజేసి, దుఃఖములను దూరము చేసే నిమిత్తమై ఈ పర్వదినములు యేర్పడుతున్నాయి. మానవునకు ఆకారముతోబాటు మేధాశక్తి కూడను భగవంతుడనుగ్రహించాడు. ఈ విధముగా అనుగ్రహించాడుకాని కాయమునకు ఆయుః ప్రమాణము తక్కువగా ఇచ్చాడు. భగవంతుడందించిన ఈ మేధాశక్తిని మనము సద్వినియోగము చేసి దాని ప్రతి ఫలమును ఆనందమును మనము అనుభవించాలి. కాని అందించిన మేధాశక్తిని ఈనాటి మానవుడు దుర్వినియోగము గావించుకుంటున్నాడు.

భగవంతుడందించిన శక్తిని తన స్వార్థమునకుగాక జగత్తున కందించటానికి ప్రయత్నించాలి. సమాజములో జన్మించినాము. సమాజములో బ్రతుకుతున్నాము. సమాజములోనే అంత్యమవుతున్నాము. సమాజము వదలి ఒక్క క్షణమైనా మనము జీవించలేము. సమస్త అనుకూలములు, సమస్త సంతోషములు, సమస్త సదుపాయములు మనము సమాజము నుండే అందుకొంటున్నాము. ఇన్ని విధములైన సుఖములు, సదుపాయములు అందుకొన్న మనము సమాజమునకు ఏమి కృతజ్ఞత చూపుతున్నాము. కృతజ్ఞతను తెలియజేయటమే మానవుని ప్రధాన కర్తవ్యము. ఈ కృతజ్ఞతయే భక్తి అనికూడ చెప్పవచ్చు. కేవలము నామస్మరణ చేయటము మాత్రమే కాదు. నామస్మరణ కూడా అవసరమే.

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం**

srisathyasaivachanamrutam

**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్.**

దాస్యం, స్నేహం, ఆత్మ నివేదనం కృతజ్ఞతా చిహ్నాలే. ఈ కృతజ్ఞతే లేకుండిన అడవిలో నివసించిన మృగమే అవుతాడు మానవుడు. కనుక మానవత్వాన్ని దివ్యత్వముగా మార్చుకొని దైవత్వము పొందే నిమిత్తమై ఈ ఉగాది మనలను హెచ్చరిస్తూ ఉంటుంది. ప్రతి సంవత్సరము సర్వమునందు వసించేవాడు సంవత్సర స్వరూపుడు కదా! ఈ సంవత్సరమున మనము ఆరాధిస్తున్నాము. సెకనులతో, నిముషములతో, గంటలతో, దినములతో, మాసములతో కూడినది కాదు సంవత్సరము. ప్రతిక్షణము ఒక సంవత్సరమే. అరవై సెకనులు లేకపోతే ఒక నిముషము లేదు. నిముషములు లేకపోతే గంటలు లేవు. గంటలు లేకపోతే దినములు లేవు. దినములు లేకపోతే నెలలు లేవు. నెలలు లేకపోతే సంవత్సరము లేదు. అందువలన నూతన సంవత్సరమునకై పన్నెండు నెలలు కాచుకోనక్కర లేదు. నూతన సంవత్సరము కాదు. నూతన సెకండు. కనుక మనము ప్రతిక్షణము నూతనమైనదిగా భావించి నూతనమైన భావములతో ప్రతి క్షణము మనము గడుపుతూ రావాలి. నూతనమైన భావములతో, నూతనమైన ఉత్సాహముతో, పవిత్రమైన తలంపులతో ఈ క్షణము మనము గడుపుతూ రావాలి. క్షణక్షణము తన యందుండినటువంటి దుర్గుణములను, దుర్భావములను విమర్శించుకోవాలి. సద్గుణములను, సద్భావములను అభివృద్ధి పరచుకోవాలి.

ప్రేమస్వరూపులారా! భారతదేశము ప్రాచీన కాలము నుండి అనేక విధములైన ఆదర్శములను, పవిత్రతను బోధిస్తూ వస్తున్నది. కేవలము పాంచ భౌతికమైన దేహము మాత్రమే కాకుండా పంచభూతములు తత్త్వమే కాకుండా సర్వత్రా ఏకత్వమైనది దివ్యత్వాన్ని కూడా బోధిస్తూ వస్తున్నది. ఈనాడు అట్టి పవిత్రమైన, నిర్మలమైన, నిస్వార్థమైన భావములను విడచి అశాశ్వతము, అస్థిరములైన భావములను అవలంబించి మానవత్వాన్ని వ్యర్థము గావించుకొంటున్నాము.

ఇంక ప్రద్యుమ్నుడు. ఈ ప్రద్యుమ్నుడెవరు? మన్మథునకు ఈ పేర్లు ఉంటున్నాయి. ఈ మన్మథుడెవరంటే భగవంతుడే. సర్వమును ఆకర్షించేవాడే. అతి సుందర స్వరూపుడతడే. ఇట్టి దివ్యశక్తి ప్రతి అణువునందు ఉన్నది. ఎవరిని ద్వేషించరాదు. ఎవరిని మనము బాధించరాదు.

sri sathyasai vahini

అందరిలో ఉన్న దివ్యత్వము దైవత్వమే. ఆకారములు వేరుగా ఉండవచ్చును. అణోరణీయాన్ మహతోమహీయాన్. సూర్యుడు ఒక్కడే అయినా వేరువేరు కాలములలో వివిధ రీతులలో వేడిని ప్రసరింపచేస్తూ వుంటాడు. అదే విధముగా అనేక విధములుగా భగవంతుడు సాక్షాత్కరిస్తూ వుంటాడు. భగవంతుని అనేక రూపములు అనేక నామములు కానీ అనేకత్వములోని ఏకత్వము ఒక్కటే. అదే దివ్యత్వము.

**మానవజన్మ విశిష్టమైనది**

మానవ జన్మ అతి పవిత్రమైనది. అతని ఆకారము అతి పవిత్రమైనది. అందువలన ప్రతి అంగము సార్థకము గావించుకోవటానికి ప్రయత్నించాలి. ప్రొఫెసర్ అనిల్‌కుమార్ చెప్పాడు. వాగ్దోషము, క్రియా దోషము, దృష్టి దోషము, భావ దోషము, శ్రవణ దోషము. వాగ్దోషము ప్రధానమైనది. భగవంతుడు రెండు కన్నులిచ్చాడు. రెండు చెవులిచ్చాడు కావలసినన్ని విషయాలు వినవచ్చు. కాని వీటికి తలుపులు లేవు. కాని నోరు ఒక్కటే ఇచ్చాడు. అందువలన 'మిత భాష అతి హాయి. అతి భాష మతి హాని' అన్నారు. ఈ మితభాషలో కూడ మరింత అవసరమైనది హితభాష. అంతేగాని పరులను నొప్పించే మాటలు ఎవ్వరితోనూ మాట్లాడకూడదు. 18 పురాణములలో ఏ ఒక్క పురాణము కూడా చదవటానికి మానవునకు సమయము చాలదు. ఇక 18 పురాణములను చదవటానికి ఎక్కడ సమయము చిక్కుతుంది. పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనం ఇదే అష్టాదశ పురాణముల సారము. అదే Help Ever Hurt Never. దేహానికి గాయము తగిలితే డాక్టరు వద్దకు వెళ్లి ఆయింటుమెంటు పెట్టుకొని, బ్యాండేజి పెట్టుకొని గాయము నయము చేయించుకోవచ్చు. 'కాలు జారితే కలుగదు నష్టము, నోరు జారితే నరకమేరా' అన్నారు. హృదయమునకు తగిలిన గాయము ఎవ్వరికి కనిపించదు. అందువలన ఎవరి మనసు మనము గాయపరచకూడదు.

**దేశక్షేమమే దేహ క్షేమము**

ఇంతే కాకుండా నాయకత్వాన్ని వహించి, ఆదర్శాన్ని అందించిన దేశము భారతదేశము.

**ఖండ ఖండాంతర ఖ్యాతినార్జించిన**

sri sathyasai vachanamrutam

మహనీయులనుగన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమునుగొన్న సమర భూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీ శక్తి జూపిన దివ్యభూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ జూపిన యట్టి భరతభూమి

చిత్రకళల తోడ చిత్రమై యున్నట్టి
భరత భూమియందు ప్రభవ మంది
భరతమాత గౌరవము కాపాడు
బాధ్యతంతయు మీదె భక్తులార!

ఇటువంటి భరతమాతకు మనము ఏమి సేవ చేస్తున్నాము? దేశ క్షేమమే దేహ క్షేమము. రావణ సంహరణ అనంతరము అందరూ రాముని చుట్టూచేరి 'స్వామీ! మీరు ఈ లంకా పురములోనే ఉండి పాలించవచ్చును'. అని లంక వైభవమును వర్ణిస్తూ వచ్చారు. ఎంతో వైభవముతో కూడిన లంకను ఎందుకు వదలాలి? మీరే పాలించండి' అన్నారు. అప్పుడు 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' పిచ్చివాడా నేను జన్మించిన దేశము, నన్ను కన్న తల్లి వీరికి మించిన వారు నాకు అన్యులు లేరు. ఈ లంకాపట్టణ ఆనందాలు, సదుపాయాలు నేను ఎన్నడూ ఆశించలేదు. తన తల్లి కురూపి అయినను తల్లి తల్లే. ఆమె నిజమైన తల్లి. కన్న తల్లిని ఏనాడు విడచిపెట్టరాదు. అదేవిధముగా జన్మభూమి. జన్మభూమిని కూడ మనము విడచిపెట్టరాదు. అదే యువకులు ఈనాడు నేర్చుకోవలసినది. నా దేశము, నా మాతృభూమి అన్న విశ్వాసము ఈనాడు యువకులు పూర్తిగా కోల్పోయినారు. భారతదేశములో వీచేగాలిని ముక్కుతో పీల్చుతూ పవిత్ర గంగాజలమును త్రాగుతూ, పవిత్రమైన వేదశాస్త్ర ఇతిహాస పురాణములను అనుభవిస్తూ, విదేశీయ తత్త్వాన్ని అనుసరిస్తున్నారు. ఇది ద్రోహము. భారతదేశమును మనము విస్మరించరాదు. దానిని విశ్వసించి దానిని అభివృద్ధి చేయటానికి

srisathyasaivachanamrutam

తగిన కృషి చెయ్యాలి. స్వప్నములో కూడ తన మాతృదేశమునకు ద్రోహము తలంచరాదు. నా దేహములో ప్రవహించునది భారతదేశ రక్తము.

**ఇది నా మాతృదేశము**
**ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం**
**చెదగొట్టినుడువనేరక**
**బ్రతికిన పీనుగొకండు వసుధను గలడా!**

నిజముగా ప్రపంచమునకు ఆధ్యాత్మిక నాయకత్వము వహించిన దేశము భారతదేశము.

**భగవత్ప్రేమయే నిజమైన సంపద**

భగవత్ప్రేమను పొందే భాగ్యమే మన నిజమైన సంపద. ఆ ప్రేమతత్వాన్ని పొందే అదృష్టవంతులుగా మనము తయారుకావాలి. ఈ ప్రేమతత్వాన్ని పొందలేని వాడు జగత్తులో కించిత్ కూడా సాధించలేడు. దూరములోనే భగవంతుడున్నాడను కుంటే భగవంతుడు దూరములోనే ఉంటాడు. దగ్గరలోనే ఉన్నాడనుకుంటే భగవంతుడు తనలోనే ఉన్నాడు. అంతా దృష్టి దోషమేగాని సృష్టిదోషమేమాత్రము లేదు. దైవప్రేమను ధీశక్తితోగాని, మేధాశక్తితోగాని పొందటానికి యేమాత్రము సాధ్యము కాదు. ఒక్క నిర్మలమైన ప్రేమద్వారానే భగవత్ప్రేమను పొందటానికి వీలవుతుంది. కనుక అట్టి ప్రేమను మనము సాధించాలి. మానవుడు జగత్తులో సాధించవలసిన ముఖ్యమైన వస్తువు భగవత్ప్రేమ. భగవత్ప్రేమతో యేమైనా మనము సాధించవచ్చును. ఎంతటి ఉన్నతస్థాయినైనా మనము అందుకోవచ్చు. కనుక మనము భగవత్ప్రేమకు గురికావాలి.

దీనికి మనము పాత్రులము కావాలంటే కాల కర్మ కర్తవ్యాలు అత్యవసరమనే విషయాన్ని మనము గ్రహించాలి. కాలము భగవత్ స్వరూపము. కర్తవ్యము భగవదాజ్ఞ. కరిష్యే వచనం తవ. నీ ఆజ్ఞయే నాకు ప్రధానము. అన్నాడు అర్జునుడు. అర్జునుడు చాలా తెలివితేటలు కలిగినవాడు. కృష్ణునితో చాలా వాదించాడు. గీతలోని మొదటి అధ్యాయమంతా అర్జునుని విషాదమే. Tapలో వచ్చే నీరు tank నుండి వచ్చినదే కనుక మనము tankతో కనెక్షన్ పెట్టుకోవాలి. ఆ tank తో కనెక్షన్ పెట్టుకుంటే నీరు ఎప్పుడు సంవృద్ధిగా ఉంటుంది. నా

srisathyasaivachanamrutam

బంధువులు, నా మిత్రులు అని ఈ tapsతో అర్జునుడు కనెక్షన్ పెట్టుకున్నాడు. ఎంతో కృష్ణునితో వాదించాడు. కాని ఈ శక్తిని ఎవరిచ్చారు. నీ దేహమునందు, నీ బుద్ధియందు, నీ జ్ఞానమందు సర్వత్ర ఉండినవాడు ప్రజ్ఞ. అంతేకాదు. అతను constant integrated awareness. అది సర్వత్ర ఉంటున్నది. అది ఎవరిచ్చినటువంటిది? అది దైవమిచ్చినటువంటిది. కానీ మానవుడు ఇది నాది నాది అని అనుకుంటున్నాడు. అది పొరపాటు. నీవు దైవశక్తిపైన ఆధారపడాలి. ఆ విధముగా ఆధారపడిన మానవుడే నిజమైన మానవుడు. ఆదర్శవంతుడైన మానవుడు. మనము భగవద్విశ్వాసాన్ని పెంచుకొని మన జీవితము సార్థకము చేసుకోవాలి. లోకులు కాకులు. వారి దూషణ భూషణలకు లొంగక లోకేశుని సేవించాలి.

**విశ్వాసము - అనుభూతి**

ఒకానొక సమయములో ఉద్ధవుడు గోపికల దగ్గరకు వెళ్ళాడు. అమ్మా మీరు నిరంతరము మీ కర్తవ్యాన్ని విస్మరించి కృష్ణా! కృష్ణా అని అంటున్నారు. మీ అత్తలు మీ భర్తలు వారి కోపానికి గురౌతున్నారు. మీరందరు కాలాన్ని దుర్వినియోగము చేస్తున్నారని గోకులములో అందరూ అనుకుంటున్నారు. అప్పుడు గోపికలు చెప్పారు ఉద్ధవా! కాకుల కూతలకు వెరచి కోకిల తన గానమును మానుకొంటుందా? కొంగలు పరుగెత్తుతున్నాయని హంస తన రూపాన్ని మార్చుకుంటుందా? మాకు భగవంతుడు తప్ప అన్యము మాకు లేదు. ఎవరైనా ఏమైనా అనుకోనీ లోకులు కాకులు. ఆ కాకుల కూతలకు వెరచి మా పవిత్రగానాన్ని మానుకోము. దీనితో ఉద్ధవుని మనస్సుకూడా మారింది. ఇదే నిశ్చల భక్తి. ఇదే నిర్మలమైన జ్ఞానము. అదే నిజమైన విశ్వాసము. శ్వాసయే విశ్వాసము. నీ తల్లిని నీవు ప్రేమిస్తావు దీనికి ఏమిటి reason. ఆమె నా తల్లి అన్న విశ్వాసమే reason. ఈ విధముగా చెప్పే విద్యార్థులున్నారు. నీవు భగవంతుని ఎందుకు పూజిస్తున్నావని అడుగుతే He is my God. అని ఎందుకు చెప్పలేక పోతున్నావు. దీనికి ఏమిటి నీ experience. No excperience ఇది నా విశ్వాసము. కనుక faithకు reason లేదు. దీనికి experimentation లేదు. నా అనుభూతే నా విశ్వాసము. కనుక భగవద్భక్తియందు విశ్వాసము, అనుభూతి రెండే అవసరము. ఈ రెండింటికి

sri sathyasai vachanamrutam

ప్రేమయే మూలకారణము.

ప్రేమస్వరూపులారా! ఈ యుగములో నామస్మరణకు మించినది మరొకటి లేదు. ఈనాడు 24 గంటల లోపల అధిక కాలమును వ్యర్థము చేస్తున్నాడు. కాలమును వ్యర్థము చేయక కాలమును సార్థకము చేసుకోవాలి. కాల. క అనగా శుభము, సుఖము. ల అనగా అందించేటువంటిది. సర్వ శుభములను అందించేటువంటిదే కాలము. కాలము కాయాన్ని మ్రింగుతుంది. కాలుడు కాలాన్నే మ్రింగుతాడు. కనుక భగవత్ స్వరూపమైన కాలాన్ని మనము అలక్ష్యము చేయరాదు. విరామ కాలములో భగవన్నామస్మరణ చేయి. నీ చేతులతో కర్మలు చేస్తూ నామస్మరణ చేయి. ప్రాపంచిక సంబంధమైనవి తలలో చేర్చుకోనక్కర లేదు. Hand in Society Head in the forest that is real rest.

**(తేది. 07-04-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam